సమాచారం

నియామకం



శేరిలింగంపల్లి: బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మైనార్టీ మోర్చా కార్యదర్శిగా సయ్యద్ అతియా సుల్తానా నియమితులయ్యారు. గురువారం తారానగర్‌లోని పార్టీ కార్యాలయంలో బీజేపీ మల్కాజిగిరి పార్టీ ఇన్‌చార్జ్ పోరెడ్డి బుచ్చిరెడ్డి, చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రామ్‌రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాకేష్ దూబే, నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వేణు, లలిత, నరసింహారెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మనూ' విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మహ్మద్ ఫైజాన్



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మహ్మద్ ఫైజాన్ ఎన్నికయ్యారు. గురువారం ఉదయం 2022–23 విద్యా సంవత్సరానికి విద్యార్థి సంఘం ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికలలో యూనివర్సిటీలోని ఎంసీజే డిపార్ట్‌మెంట్‌కు చెందిన మహ్మద్ ఫైజాన్ 10వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో విద్యార్థులు ఓటు వేశారు. పోలింగ్ అనంతరం ఫలితాలను ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా మహ్మద్ మిస్బాజాఫర్, కార్యదర్శిగా ఫైజాన్ ఎక్బాల్‌తో పాటు మరికొందరు ఎన్నికయ్యారు.

క్లుప్తంగా...

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌కు చెందిన ఉమాదేవి వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.22000ల చెక్కును గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పేదలకు భరోసానిస్తుందన్నారు. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, చంద్రకాంత్ రావు, భగవాన్, కార్తిక్‌రావు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో సంక్రాంతి వేడుకలు



మాదాపూర్: మాదాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో గురువారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. బొమ్మల కొలువు, రంగవల్లుల ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హైమ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పటాన్‌చెరుటౌన్: పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామ శివారులో టప్ప కృష్ణ పొలంలో గుర్తుతెలియని వ్యక్తి(39) మృతదేహం కనిపించింది. స్థానికులు వీఆర్ఏకు సమాచారం ఇవ్వడంతో ఆయన పటాన్‌చెరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కన విద్యుత్ వైర్ ఉండడంతో విద్యుదాఘాతంతో మృతిచెందాడా లేదా అనారోగ్య సమస్యతో మృతిచెందాడా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

సంక్రాంతికి ఊరెళ్తే జాగ్రత్త

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంక్రాంతి పండుగకు సొంత ఊర్లకు వెళ్లేవారికి సైబరాబాద్ పోలీసులు జరభద్రమంటూ సోషల్ మీడియాలో పలు సూచనలు చేస్తున్నారు. ఊరికి వెళ్లేవారు అవసరమైతే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. విలువైన వస్తువులను, బంగారం, నగదును ఇంట్లో ఉంచరాదని సూచిస్తున్నారు. అవసరమైతే వాటిని లాకర్లలో భద్రపరుచుకోవాలని కోరుతున్నారు. ఎవరైనా కాలనీలలో అనుమానాస్పదంగా సంచరిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని, లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.





ఐటీ కారిడార్‌లో ఆకట్టుకుంటున్న సైన్స్ పార్క్

- మాదాపూర్‌లో సైన్స్ పార్క్ ఏర్పాటు చేస్తున్న అధికారులు
- చిన్నారులను ఆకట్టుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు
- ఐటీ ఉద్యోగుల కోసం ఫ్రీ వైఫై సౌకర్యం
- అందుబాటులో మొబైల్ చార్జింగ్ పాయింట్లు




మాదాపూర్: మాదాపూర్‌లోని పత్రికానగర్‌లో సైన్స్ పార్క్ ఏర్పాటు చేస్తున్నారు. పార్క్‌కు ప్రత్యేక ఆకర్షణగా ప్రధాన ద్వారం ఏర్పాటు చేశారు. చిన్నారులతో పాటు ఐటీ ఉద్యోగులను ఆకట్టుకునేలా పార్క్‌లో వివిధ రకాల ఆకృతులను ఏర్పాటు చేస్తున్నారు. ఐటీ కంపెనీల మధ్యలో పార్కు ఏర్పాటు చేయడంతో ఉద్యోగులు సేద తీరేందుకు ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. పార్కులో మినీ జిమ్‌తో పాటు వాకింగ్ ట్రాక్, వైఫై వసతులు కల్పించనున్నారు.

- ఐటీ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లను ఆకట్టుకునేందుకు ప్రధాన ద్వారం ఆకర్షణీయంగా ఉండేలా ఒపెన్ ఆర్చ్ ఏర్పాటు చేశారు.
- సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు జిమ్ ఏర్పాటు చేశారు.
- వృద్ధులు, చిన్నారులు కూర్చునేందుకు చెక్కల ఆకారంలో ఏర్పాటు చేసిన కుర్చీలు, బెంచ్‌లు ఆకర్షణగా నిలుస్తున్నాయి.
- చిన్నారులు ఆడుకునేందుకు చెక్కతో తయారు చేసిన ఇంటి ఆకృతులు, వివిధ రకాల సైన్స్ వస్తువులు ఆకట్టుకుంటున్నాయి.
- వివిధ రకాల మొక్కలతో పూర్తి స్థాయిలో గ్రీనరీని ఏర్పాటు చేస్తున్నారు. పిల్లలు ఆడుకునేందుకు లాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కువగా ఆక్సిజన్ ఇచ్చే మొక్కలను, వివిధ రకాల పూల మొక్కలను నాటుతున్నారు.
- ఐటీ కారిడార్ కావడంతో ఉద్యోగులు సైతం వినియోగించుకునేలా ఫ్రీ వైఫై సౌకర్యం కల్పిస్తున్నారు.
- మొబైల్ చార్జింగ్ పాయింట్‌లను సైతం ఏర్పాటు చేయనున్నారు.





ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని వినతి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల చౌరస్తా నుంచి తెల్లాపూర్ వెళ్లే సర్కిల్‌లో ఏర్పాటు చేసిన దిమ్మె సైజును తగ్గించి అక్కడ సిగ్నల్స్, జీబ్రాక్రాసింగ్ లైన్ ఏర్పాటు చేయాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. గోపన్‌పల్లి తండా నుంచి ఎన్టీఆర్‌నగర్ వైపు వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వద్ద సైం ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ లైన్ ఏర్పాటు చేయాలని డీసీపీకి విజ్ఞప్తి చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లో ఐటీ కంపెనీలు, ఇంటర్నేషనల్ స్కూల్స్, చేరువలోనే ఉన్నత విద్యా సంస్థలు ఉన్నందున రాకపోకలు సాగించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉత్పన్నమవుతున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డీసీపీ హామీ ఇచ్చారని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు.



ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

క్రైం కార్నర్..

సెల్‌ఫోన్ల దొంగ అరెస్ట్

మాదాపూర్: సెల్‌ఫోన్లను దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్ ముఖీమ్(29) వెల్డర్ పనిచేస్తున్నాడు. సైబరాబాద్ పరిధిలోని పలుచోట్ల సెల్‌ఫోన్‌లను దొంగతనం చేస్తున్నాడు. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి విచారించగా నేరాలను ఒప్పుకున్నాడు. దాదాపు రూ.2లక్షల విలువ గల 12 సెల్‌ఫోన్‌లను దొంగిలించినట్లు తెలిపారు. అతడిపై సైబరాబాద్ పరిధిలో 7 కేసులు ఉన్నట్లు తెలిపారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ.. ఇద్దరికి స్వల్ప గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

మియాపూర్: ఎదురుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును మరో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలైన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అహ్మద్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 6 గంటల సమయంలో మియాపూర్‌లోని మదీనాగూడ వద్ద జాతీయ రహదారిపై పక్కన భీమవరం డీపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆగి ఉంది. అదే సమయంలో హెచ్‌సీయూ డీపోకు చెందిన సిటీ బస్సు జగద్గిరిగుట్ట నుంచి లింగంపల్లి వైపు వస్తున్న క్రమంలో ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న ఓ మహిళతో పాటు మరో బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



రాయదుర్గం నాగార్జున ఉన్నత పాఠశాలలో..

గచ్చిబౌలి/రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం వేడుకలు నిర్వహించారు. పాఠశాలల్లో గంగిరెద్దుల ప్రదర్శన, ముగ్గుల పోటీలను నిర్వహించి సంక్రాంతి పర్వదిన ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

- రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.
- గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సుందరయ్య టోర్నీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు.
- చందానగర్‌లోని శ్రీవిద్యామందిర్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగోళి పోటీలను నిర్వహించారు. గంగిరెద్దుల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.



చందానగర్ శ్రీవిద్యామందిర్‌లో..



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న హ్యాండీక్రాఫ్ట్స్ ఫెయిర్‌లో భాగంగా గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నాట్య భారతి ట్రస్ట్ కర్ణాటక శిష్య బృందంచే భరత నాట్యం ప్రదర్శించి అలరించారు. వైదేహి సుభాష్ శిష్య బృందం సీతారామ కల్యాణం నృత్య రూపకాన్ని ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.



అన్ని చెరువులను సుందరీకరిస్తాం



గంగారం పెద్ద చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్ద చెరువు, భక్షికుంట, మియాపూర్‌లోని పటేల్ చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, రెవెన్యూ, హెచ్ఎండీఏ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చందానగర్‌లోని గంగారం పెద్ద చెరువు రూ.19కోట్లతో, మియాపూర్ పటేల్ చెరువు రూ.12.20 కోట్లతో సుందరీకరణ పనులను చేపట్టినట్లు తెలిపారు. రాజేందర్‌రెడ్డి నగర్‌లోని భక్షికుంట చెరువు పెనోమ్ పీపుల్ ఐటీ కంపెనీ టీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా బైరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. పనులను వేగవంతం చేసి వర్షకాలంలోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చెరువు చుట్టూ కంచెలను ఏర్పాటు చేసి కబ్జాలకు గురికాకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ అధికారి ఈఈ పద్మ, డీఈ జగన్‌మోహన్, ఏఈ జీవన్‌రెడ్డి, శివకుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, టీపీఎస్ అధికారి మధు, డివిజన్ల అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల సాధనపై దృష్టి పెట్టాలి

రాయదుర్గం: రాయదుర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్ గురువారం పరిశీలించారు. మొదట ఆయన రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, అనంతరం ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ నిర్వహణ, తరగతి గది బోధనను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉన్నత పాఠశాల రాయదుర్గంలో పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఫలితాలు మెరుగ్గా రావడంపై అందరూ దృష్టి పెట్టాలని, విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన పెరిగేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల డౌట్లను ఎప్పటికప్పుడు తీర్చేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం తాజ్ బాబు, సీఆర్పీ రాజశేఖర్ ఉన్నారు.



ఉర్దూ మీడియం పాఠశాలలో బోధన విధానాన్ని పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ రాజీవ్

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం

హఫీజ్‌పేట్: కొండాపూర్ డివిజన్ పరిధిలో సుమారు రూ.1.10 కోట్లతో సీసీ రోడ్ల పనులు చేపడుతున్నట్లు స్థానిక కార్పొరేటర్ హమీద్‌పటేల్ పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌లో అభివృద్ధి పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ టెంపుల్ పక్కన రూ.45 లక్షలతో, సాగర్ హాస్పిటల్ రోడ్డు మొదటి ఎడమ వైపు వీధిలో రూ.25 లక్షలతో, హోలీ ఫాతిమా స్కూల్ పక్క వీధిలో రూ.40లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. డివిజలోని ప్రతి కాలనీ, బస్తీలో నీళ్లు, రోడ్లు, కరెంటు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు అహర్నిశలు శ్రమిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హమీద్‌పటేల్ తదితరులు

లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు



ప్రయాణికులను తనిఖీ చేస్తున్న పోలీసులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో బుధవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి ఆధ్వర్యంలో లింగంపల్లి స్టేషన్‌లో రెండు గంటల పాటు తనిఖీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో రద్దీ దృష్ట్యా చోరీలు చేసేందుకు వచ్చే వారిని గుర్తించేందుకు తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా ఉన్న వారి గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి రైళ్లలో వచ్చే అనుమానితులను తనిఖీ చేస్తున్నామన్నారు. గతంలో సంక్రాంతి సెలవుల సమయంలో జరిగిన దొంగతనాలను దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ముంబై, కర్ణాటక, గుల్బర్గా, రాయచూర్ తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి రైలు సౌకర్యం ఉండడంతో నిందితులు చోరీలు చేసి సులభంగా వెళ్లిపోతున్నారన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని తనిఖీలు ముమ్మరం చేశామని, ఇవి కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు క్యాస్ట్రోరెడ్డి, సంజీవ్‌కుమార్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.మనోజ్‌కుమార్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎం.ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ సేవలు మరువలేనివి

పటాన్‌చెరు టౌన్: పీజేఆర్ సేవలు మరువలేనివని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. గురువారం పీజేఆర్ జయంతిని పురస్కరించుకొని బీఎంఎస్ యూనియన్ సభ్యులతో చిట్కుల్ గ్రామ సమీపంలోని జీటీఎన్ పరిశ్రమ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జీతయ్య, నరేశ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం స్వామి వివేకానంద

మియాపూర్: చందానగర్‌లోని గౌతమినగర్ కాలనీ పార్క్‌లో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట నాయకుడు, గౌతమినగర్ కాలనీ చీఫ్ అడ్వైజర్ కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్యం కోసం అలుపెరగకుండా శ్రమిస్తే నేడు కాకపోయినా రేపు అయినా విజయం సాధ్యమవుతుందని స్వామి వివేకానంద అన్నారన్నారు. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నూనే సురేందర్, బీజేపీ నాయకులు కసిరెడ్డి సింధూరెడ్డి, అశోక్ కుమార్, సాయికుమార్, మురళీధర్, రామస్వామి, ఆది శేషయ్య, లక్ష్మణ్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడలో..

గచ్చిబౌలి: వివేకానందుడు అందరికీ ఆదర్శమని బీజేపీ నాయకుడు రాధాకృష్ణయాదవ్ అన్నారు. కొత్తగూడలోని శారద స్కూల్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వివేకానందుడు వేదాంత, యోగతత్వ శాస్త్రం, సమాజంపై అత్యంత ప్రభావం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారన్నారు. భారతదేశ చరిత్రలోనే ఎంతో ప్రాముఖ్యతను పొందుతూ ఇతర దేశాలలో సైతం తన ప్రత్యేకతను చాటారన్నారు. ఇలాంటి మహనీయుల గురించి నేటి తరం విద్యార్థులు, యువత తెలుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్కూల్ కరస్పాండెంట్ నరేందర్, జేఎన్టీయూ ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వివేకానందకు నివాళులర్పిస్తున్న బీజేపీ నేత కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు



శారద స్కూల్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రాధాకృష్ణయాదవ్